# అమెరికా అల్లుడు

అమ్మాయి అల్లుడు అమెరికానుండి వచ్చారు. పెళ్ళైన రెండేళ్ళకి ఇదే రావడం. రాక రాక వచ్చిన కూతుర్ని చూసి తెగ సంబరపడిపోయారు పార్వతీసం దంపతులు.

ఈ రెండేళ్ళు ప్రసన్న కనబడకపోవడంతో శాంతమ్మ పడ్డ మనోవేదన అంత ఇంతా కాదు. "ఏమిటో ఒక్కగాని ఒక్క అడబిడ్డని అంత దూరం ఇచ్చేసాం ఏదైనా దగ్గర సంబందం చేసుకుంటే బావుండేది. . . ఓ రాక. పోకా . . ఫ్. . . 'ఫోను వేయించుకోండత్తయ్యా బావుంటుంది' అని అల్లుడు ఎంత మొత్తుకుంటున్నా మీరాపని చెయ్యరు. నాకున్న బాధలో మీకు ఆవగింజంతైనా ఉంటేనా?" ఇలా భర్త ముందు ఎన్నిసార్లు వాపోయిందో!

ఆమె ఆ ముక్క అన్నప్పుడెల్లా ఓ నిట్టూర్పు విడవడం మినహా పార్వతీశం మాత్రం ఏం చేస్తాడు? అతడికి మాత్రం కన్నబిడ్డ దగ్గర్లో ఉండాలనిపించదా? పిల్ల సుఖపడితే చాలన్న ఉద్దేశ్యంతో కదా దూరాన్ని లెక్కచేయలేదు. దూరం మాట ఎలా ఉన్నా వాళ్ళు పైసా కట్నం ఆశించలేదు కాబట్టి తనింత గొప్ప సంబంధం చేయగలిగాడు. పోతే ఫోను పెట్టించుకుంటే బావుంటుందన్న తలంపు తనకూ ఉంది. అందుకు ఆర్థిక పరిస్థితి అనుమతించాలి కదా! ఇవేవీ ఎవరు ఆలోచించరు. తను గుడిలో పూజారి. భక్తులు పళ్ళెంలో విదిల్చే చిల్లరే తన ఆదాయం. తాతల నాటి కొంప ఉండబట్టి సరిపోయింది లేకుంటే చెట్టు కింద నిలబడాలి.

ఎంతోకాలానికి మళ్లీ కన్నబిడ్డను చూడగలిగినందుకు ఎంతో సంతోషంగా వుంది



పార్వతీశానికి. ఇక శాంతమ్మ సంగతి సరేసరి. ప్రసన్న గడపలో కాలు పెట్టినప్పటి నుండి ఆమెను విడిచిపెట్టడం లేదు. తియ్యటి కబుర్లతోనే కూతురు కడుపు నింపేస్తోంది. వచ్చినప్పటినుండి నాన్న మాత్రం మాట మంతి లేకుండాఅల్లుణ్ణే యగా దిగా చూడటం వింతగా వుంది ప్రసన్నకి.

పార్వతీశం మాటి మాటికి తన గదిలోకి తొంగి చూడటం గమ నించిన నవీన్ "రండి మామయ్య గారూ లోపలకు రండి" అన్నాడు లేచి నిలబడి.

"దేశం కాని దేశం నుంచి వచ్చావు. పరవాలేదు రెస్టు తీస్కో తర్వాత తీరిగ్గా మాట్లాడు కోచ్చు. అన్నట్లు అడగడం మరిచాను నీ ఆరోగ్యం ఎలా వుంది?" అడిగాడు పార్వతీశం.

"నాకేమైంది బాగానే ఉన్నానే. మీరే పూర్వం కంటె బాగా వడలిపోయారు" అన్నాడు నవీన్.

"నా మాటకేంగాని, నీకు ఎప్పుడైనా ఈమధ్య కడుపులో మంట. నొప్పి. జ్వరం లాంటివేమైనా. . . " అంటూ ఆగాడు పార్వతీశం.

"మీ అమ్మాయిని కట్టుకు న్నప్పటినుండి జిర్రుమని చీదలేదంటే నమ్మండి" అన్నాడు నవీన్ నవ్వుతూ.

"నాకు కావలసింది అదే బాబు. నిండు నూరేళ్ళు నువ్వు ఆరోగ్యంగా ఉండాలనేనయ్యా నేనా భగవంతుణ్ణి కోరుకునేది."

భర్త మాటలు వింతగా తోచాయి శాంతమ్మకి. అక్కడితో ఊరుకోకుండా అతడు కూతురితో కూడా అల్లుడి ఆరోగ్యం గురించి వాకబ్ చెయ్యడం ఆమెను మరింత

దిగ్భ్రమకు గురిచేసింది.

నవీన్ ఆరోగ్యం పట్ల తండ్రి ఆరాటాన్ని చూసి "ఏమిటి నాన్నా అస్తమాను అల్లుడిగారి ఆరోగ్యం గురించే అడుగుతున్నావు. మాట్లాడటానికి మరో మాట లేదా" అన్నది ప్రసన్న. నవ్వి ఊరుకున్నాడు పార్వతీశం.

"మీ ధోరణి నాకు కూడా అర్ధమై చావడంలేదు. అల్లుడు ఇంట్లో అడుగుపెట్టినప్పటి నుండి చూస్తు న్నాను - అతడి ఆరోగ్యం గురించే తప్ప మరో ముక్క మాట్లాడటంలేదు. మీ వాలకం చూస్తుంటే నాకేదో అనుమానంగా ఉంది. ముందు మీ మనసులో ఏముందో చెప్పండి" అంటూ పెనిమిటిని నిలదీసింది శాంతమ్మ.

"నీ అనుమానం అఘోరించి నట్లే వుంది. ఊరికే అడిగితే ఎందుకంత టెన్షన్ పడిపోతావ్?" అన్నాడు పార్వతీశం.

పైకి అతడెంత గంభీరంగా మాట్లాడుతున్నా అతడి అంతరంగంలోని అలజడి మాత్రం అలాగే ఉంది. ఉన్నట్లుండి ఒక్క క్షణం అతడి మనసు గతంలోకి వెళ్ళిపోయింది.

★ ★ ★

"అదుగో ఇదుగో అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నావే తప్ప అమ్మాయికి సంబంధమేదీ పట్టుకురావడంలేదు"నిష్టూరంగా పలికాడు పార్వతీశం.

"కట్నకానుకలు ఇవ్వలేమని కాబోలు ఆలోచిస్తున్నట్లుంది. ఇల్లు తాకట్టుపెట్టైనా అంతోఇంతో కట్నమిస్తాం. ఈ ఇంట్లో రోలు ఆ ఇంట్లోకి దొర్లించే ఉద్దేశం మాకులేదు. ఏదైనా మంచి సంబంధం చూసిపెట్టండి" బ్రతిమాలుతున్నట్లుగా అంది శాంతమ్మ.

"మీరంతగా చెప్పాలటమ్మా. మన ప్రసన్న పెళ్ళికూతురవ్వాలని నాకు మాత్రం లేదా? పెళ్లికోసం కొంప అమ్ముకునే స్థితి రాకుండా ఉండే విధంగా చక్కటి సంబంధం కోసం గాలిస్తున్నాను. కాస్త ఓపిక పట్టండి. ఎంతోమందికి ఈ చేత్తో సంబంధాలు కుదుర్చినవాణ్ణి. మిత్రుడు సన్నిహితుడైన పార్వతీశం విషయంలో అలక్ష్యం చేస్తానా తల్లీ" ఓదార్పుగా అన్నాడు పేరాజు.

అన్నట్లుగానే ఓ రోజు హడావిడిగా వచ్చి "పిల్లను త్వరగా ముస్తాబు చెయ్యండి.

అరగంటలో పెళ్లివారొస్తున్నారు" అంటూ వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు పేర్రాజు. పెళ్ళిచూపులయ్యాయి. పిల్ల, పిల్లవాడు ఒకరినొకరు ఇష్టపడ్డారు.

అబ్బాయి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరని తెలిసి ఎంత కట్నం అడుగుతారోనని ఠారెత్తిపోయాడు పార్వతీశం.

"బెంగపడకు - వాళ్ళ కట్నం లేకుండానే మన సంబంధం చేసుకుంటున్నారు. కాకపోతే నువ్వు వెంటనే పెళ్ళి జరిపించేయాలి. పెళ్ళికొడుక్కి సెలవు లేదంట. వివాహం అయిపోయిన వెంటనే భార్యను తనతో తీసుకుపోతానంటున్నాడు. అందుకు అన్ని ఏర్పాట్లు చేసేసుకుంటున్నాడు" విషయం వివరించాడు పేర్రాజు.

"ఇదేం విడ్డూరమండి. చెప్పుల్లో కాళ్ళు పెట్టుకుని పెళ్ళిచేసేయమంటే ఇదేమైనా బొమ్మలాటా? కనీసం ఓ నెల రోజులైనా గడువు ఉండొద్దూ! వాళ్ళ మంచి చెడులేమిటో తెలుసుకోడానికైనా కొంత వ్యవధి ఉండాలి" అన్నది శాంతమ్మ.

"అవన్నీ నేను విచారించానమ్మా. మీరు మరీ జాప్యం చేస్తే ఈ సంబంధాన్ని మరొకరు తన్నుకుపోవచ్చు. పోటీ అలా ఉంది తెలుసు కదా! నా మాట విని ఇక ఏ మాత్రం జాగు చేయ కుండా ఈ శుభకార్యం జరిపించెయ్యండి" అన్నాడు పేర్రాజు.

మరి మాట్లాడలేదు పార్వతీశం దంపతులు.

ఇలా ఉండగా "పెళ్ళి కొడుక్కి లంగ్ కేన్సరట. ఎంతో కాలం బతకడంటున్నారు. విషయం బయటకు పొక్కకుముందే పిల్లవాడికి పెళ్ళి చేయాలని తొందర పడుతున్నారు" పార్వతీశంతో అన్నారెవరో.

అతడి గుండె గుభిల్లుమంది.

ఆమాటే పేర్రాజు నడిగితే "నీకు పిచ్చిగాని పట్టలేదు కదా! ఉక్కు ముక్కలా ఉన్న నవీన్‌కు కేన్సరా? ఓర్వలేని వాళ్ళె వరో ఏదో అంటే నమ్మేయడమేనా? అలాంటిదేదైనా ఉంటే నాకు తెలీకుండా ఉండదు. నా మాట విని మనసులో మరో ఆలోచన రానీయకు. ఇంకా నయం ఈ ముక్క శాంతతో అన్నావు కాదు" అంటూ తేలిగ్గా కొట్టిపారేశాడు. ప్రసన్నకు పెళ్ళైపోవడం, అమెరికా వెళ్ళిపోవడం క్షణాలమీద జరిగిపోయాయి.

పార్వతీశం పైకి భీకరంగా కనిపిస్తున్నా లోలోపల అనుమాన పిశాచం అతణ్ణి పట్టి పీడిస్తోంది. అమెరికా నుండి ఎప్పుడు ఏ దుర్వార్త వినవలసి వస్తుందో నని తెగ బెంబేలెత్తిపోయాడు. అందుకేఅల్లుడు రావడంతోనే అతడి ఆరోగ్యం గురించి గుచ్చి గుచ్చి ఆరాతీస్తున్నాడు.

★ ★ ★

అమ్మాయి అల్లుడు వచ్చినట్లే వచ్చి వెళ్ళిపోయారు. మళ్ళీ ఒంటరివాడైపోయాడు పార్వతీశం వాళ్ళు ఉన్న ఈ వారం రోజులు అతడికి టైం తెలీలేదు. అల్లుడి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అతడి పేర గుళ్లో అర్చన చేసాడు. శాస్త్రోక్తంగా రుద్రాభిషేకం చేసి అతడికి ఆయురారోగ్యాలు ప్రసాదించమని భగవంతుణ్ణి వేడుకున్నాడు. నవీన్ ఆరోగ్యంగానే కనబడటంతో మునుపటి మీద కొంత బెంగ తీరింది. అయినా ఇంకా ఏదో మూల అనుమానం పీడిస్తూనే ఉంది. డాక్టర్ చేత చెకప్ చేయిద్దామనుకుంటే అతడెక్కడ ఉవ్వెత్తున ఎగురుతాడోనని ఊరు కున్నాడు.

ఇలా ఉండగా ఒక రోజు చుక్కలా ఊడిపడ్డ పేర్రాజును చూసి "ఇన్నాళ్ళూ ఏమయ్యావయ్యా? ఏమిటలా ములంకాడలా అయి పోయావు" అంటూ పలకరించాడు పార్వతీశం.

"వెళ్ళేముందు నీకు చెప్పాలనుకున్నాను. అయింది కాదు. రాజస్థాన్‌లో ఉన్నమా అబ్బాయి అర్జంటుగా రమ్మని ఫోన్ చేస్తే ఉదయ్‌పూరువెళ్ళాను. ఏ ముహూర్తాన బయలుదేరానో అక్కడికి వెళుతూనే విడవకుండా జ్వరం పట్టుకుంది. నెల రోజులు మంచమెక్కాను. మళ్ళా బతికి బట్టకడ తాననుకోలేదు. నా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మా అబ్బాయి మరి నన్నిక్కడికి రానివ్వలేదు. వయసు పైబడటంతో చచ్చినా బతికినా ఉన్నఊళ్ళో ఉంటేనే బావుంటుందనిపించింది. అందుకే వాడు వద్దంటున్నా పోట్లాడి మరీ వచ్చేసాను. ఇంతకీ అమ్మాయి అల్లుడు బావున్నారా? ఎవరో జబ్బు గిబ్బు అన్నారని హడలి చచ్చావు కదా!" అంటూ గతం గుర్తుచేసాడు పేర్రాజు.

"బాగానే ఉన్నారు. ఈమధ్యే వచ్చి వెళ్ళారు" "సంతోషం. ఉన్నమాట ఇప్పుడు చెబుతున్నాను విను. పెళ్ళికొడుక్కి కాన్సర్ అని పుకారు పుట్టించింది నేనే. ఆ

కారణంగానే మన ఊర్లో పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు రాకపోతే మన ప్రసన్నకి చేద్దామని నా ఆలోచన. అబ్బాయికి ఎలాగైనా పెళ్లిచేసేయాలన్న దృఢ సంకల్పంతో ఉన్నారు వాళ్ళ తల్లిదండ్రులు. పిల్లవాడు అమెరికా వెళ్ళిపోతే మళ్ళా నాలుగేళ్ళ వరకు రావడం కుదర్దట. అందుకే కట్నం విషయంలో నువ్వు మొండి చెయ్యి చూపించినా నీ చేతి కాళ్ళు కడిగించుకునేందుకు వాళ్ళ అబ్బాయిని సిద్ధం చేశారు. లేకపోతే నువ్వు మరో జన్మ ఎత్తినా అంత పెద్ద సంబంధం చేయలేవు. మన మధ్య ఉన్న స్నేహబంధం నా చేత ఆ పని చేయించింది" అన్నాడు పేర్రాజు.

"మరి ఆ మాట అప్పుడే చెప్పవచ్చు కదయ్యా. ఇన్నాళ్ళూ నేనెంత మానసిక క్షోభకు గురయ్యానో నీకేం తెలుసు?" అన్నాడ పార్వతీశం.

"పెదవి దాటితే పృథివి దాటుతుందంటారు. గోడలకు చెవులుంటాయి. ఈ మాట నేను అప్పుడే అనుంటే నాకు దేహశుద్ధి జరిగేది నీవరకు ఆ సంబంధం వచ్చేది కాదు. వంద అబద్ధాలాడైనా ఒక పెళ్ళి జరిపించమన్నారు. కేవలం నేను ఒకే ఒక అబద్ధంతో గుణవంతురాలైన మన ప్రసన్నని పెళ్ళిపీటల మీద కూర్చోబెట్టాను" అన్నాడు పేర్రాజు, మిస్టరీ వీడటంతో హమ్మయ్య అనుకుని ఊపిరి పీల్చుకున్నాడు పార్వతీశం.

**(16-9-2006 ఆంధ్రభూమిడైలి)**